# చిల్లిగవ్వ బతుకు

రాత్రి అన్నం తిన్నకాస్సేపటికి అనూరాధకు ఛాతిలోనొప్పి మొదలైంది. అదే తగ్గు తుందిలే- అనుకొంది. అటుయిటు తిరిగింది. తగ్గలేదు. పడుకుంటే తగ్గు తుందేమో! అని తిరగడం ఆపి పక్కలో పడుకుంది అనూరాధ. కాని తగ్గలేదు. పైగా నొప్పి ఎక్కువైంది. వెన్నులోకి పాకింది నొప్పి.

అబ్బ! నొప్పి! అని ఛాతిమీద చేతి మునివేళ్ళతో రాసుకొంది అనూరాధ. నొప్పి తగ్గలేదు. ఆమెలో అలజడి పెరిగింది. మెల్లగా పక్కలోంచి లేచింది. చెంబులో తెచ్చి పెట్టుకొన్న మంచినీళ్ళు గ్లాసులోకి వంచుకొని తాగింది. నొప్పి కొద్దిగా తగ్గినట్లనిపించింది. పడుకొంది. పక్కమీద పడుకుందో లేదో మళ్ళా నొప్పి మొదలైంది.

ఈసారి నొప్పి ఎక్కువగా వుంది. భరించరాని నొప్పి! కొడుకు అనిల్ ఇంకాపడుకొని వుండడు అనుకొని అనూరాధ కొడుకు బెడ్రూం వైపు నడిచింది. కొడుకు కోడలూ బెడ్రూంలో టీవీ చూస్తున్నట్లున్నారు. బెడ్రూంలో లైటు వెలుగుతున్నది. బెడ్రూం తలుపు దగ్గరికి పోయింది.

''బాబూ! అనిల్!'' అని పిలిచింది అనూరాధ.

ఎవరూ బయటికి రాలేదు. ఈసారి గట్టిగా పిలిచింది. అనిల్ బయటికి వచ్చాడు.

''ఏంటమ్మా!'' అడిగాడు అనిల్. అతని గొంతులో అసహనం.

'అనిల్! ఛాతిలో నొప్పి లేస్తుందిరా!'' అంది అనూరాధ మెల్లగా. ఆమెకు శ్వాస తీసుకోవడం కష్టంగా వుంది. గాలి ఆడడం లేదు.

కోడలు విజయ బయటికి వచ్చింది.

''ఇనో తాగండి. నొప్పి పోతుంది. మీరు శనగపిండి కూర తింటున్నప్పుడే చెప్పాను ఎక్కువ తినకండీ అని. విన్నారా!'' ముఖం పక్కకు తిప్పుకొంది విజయ.

''ఎక్కువ తిన్నానా!'' అనుకొని ఆశ్చర్యపోయింది అనూరాధ. ఇనో నీళ్ళల్లో కలిపి తెచ్చి యిచ్చింది విజయ. అనూరాధ అందుకొని తాగింది. కాని వెంటనే భరించరాని నొప్పి, ఒళ్ళంతా ముచ్చెమటలు పోసాయి.

''చెమటలు పట్టేస్తున్నాయిరా!'' అంది అనూరాధ. ఆమె గొంతు పూర్తిగా నీరసంగా వుంది.

''విజయా! గుండెనొప్పి ఏమోనే'' అన్నాడు అనిల్ భార్యతో.

"ఆమెకు గుండెనొప్పేమిటి? పడుకుంటే అదే పోతుంది. ఈ రాత్రి ఎక్కడ కష్టపడ్తారు మీరు" అంది విజయ.

అనిల్ భార్య మాటలు విననట్లుగా "నేను ఆటోలో అమ్మను హాస్పిటల్‌కు తీసుక పోతాను" అన్నాడు.

ప్యాంటు షర్టు వేసుకొని తల్లిని తీసుకొని బయటికి నడిచాడు.

హాస్పిటల్లో అనూరాధను వెంటనే అడ్మిట్ చేసుకున్నారు. హార్టు పరీక్షించారు. వెంటనే ఇంజక్షన్ ఇచ్చి వైద్యం మొదలుపెట్టారు.

"హార్టు అటాక్" అన్నాడు జూనియర్ డాక్టరు.

అనిల్ ఇంటికి ఫోన్ చేసి విషయం విజయకు చెప్పి ఆ రాత్రి అక్కడే తల్లి దగ్గర వుండిపోయాడు. రెండు రోజుల తర్వాత అనూరాధకు అంజియోగ్రామ్ పరీక్ష చేసి "గుండెలో వాల్వులు మూడు మూసుకుపోయాయి. వెంటనే ఆపరేషన్ చేయాలి" అన్నాడు సర్జను.

"లేకపోతే ఆమె ప్రాణాలకే ప్రమాదం!" అన్నాడాయన.

"ఖర్చు! ఎంతవుతుందో?" నసిగాడు అనిల్.

"ఒకటి ఒకటిన్నర అవుతుంది. తర్వాత మందులు వాడాలి. వాటి ఖర్చు ఉంటుంది" చెప్పాడు సర్జను.

"ఆపరేషను వెంటనే చేయాలి?" నొక్కి చెప్పాడు సర్జను మరోసారి.

అనిల్‌కు నోటమాట రాలేదు. ఒకటి రెండు లక్షలంటే మాటలా! వున్న డబ్బంతా ఫ్లాట్ బిల్డరుకు ఇచ్చారు.

ఇండిపెండెంట్ ఇల్లు అయితే కొనుక్కోలేం. ఫ్లాట్ అయినా కొనుక్కుందాం అని అనుకున్నాం. ఇప్పుడు లక్షలు వైద్యానికి పోయమంటే ఎక్కడ్నుంచి తేవాలి? ఆలో చనల్లో పడిపోయాడు అనిల్.

అనూరాధ సర్జను ఆపరేషను అన్నమాట విన్నది. "అమ్మో! ఆపరేషనా! అంటే ఎవరు చూస్తారు తనను" అనుకొని భయపడిపోయింది.

"ఆపరేషను చేయించుకొని బతికి నేను ఈ లోకంలో చేసేదేముంది" అనుకుంది అనూరాధ. ఆమెకు తన జీవితం భర్త పోయిందగ్గర నుంచి అర్థం లేనిదానిగానే అనిపిస్తున్నది. ఏ ఉద్దేశ్యం లేనిదానిగానే కన్పిస్తున్నది.

"భారత స్త్రీకి భర్త పిల్లలు తప్ప వేరే జీవితంలేదు!" అదేగదా వింటున్నాను. ఇప్పుడది నిజమేనేమో అని అనిపిస్తున్నది. నిట్టూర్చింది అనూరాధ. "బంజరుభూమి నా జీవితం!" అని అనుకునేసరికి ఆమెకు ఏడ్పు వచ్చింది. తేరుకొని అటుయిటు చూస్తే అనిల్ కన్పించలేదు.

ఒంటరిగా ఆ హాస్పిటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో పడుకున్న అనూరాధకు తన తల్లిదండ్రులు జ్ఞాపకానికి వచ్చారు. వాళ్ళకు తను ఒక్కతే కూతురు. వాళ్ళిద్దరికి

ప్రాణసమానమై పెరిగింది. వాళ్ళ ఆశలన్నీ తనమీదే! తనకు చిన్న ముల్లు గుచ్చుకున్నా వాళ్ళ ప్రాణాలు విలవిల్లాడిపోయాయి. పెళ్ళి చేసి సాగనంపేటప్పుడు వాళ్ళెంతో ఏడ్చారు! తనూ వాళ్ళను విడువలేక విడువలేక విడిచిపెట్టి భర్తతో కాపురానికి వెళ్ళిపోయింది. ఆ తర్వాత వాళ్ళకేమైనా తను సిద్ధంగా వుండేది. వాళ్ళు పోయేటప్పుడు ఇచ్చిపోయిన ఆస్తి భర్త స్వాధీనమైంది. తర్వాత ఆ ఆస్తిని ఆయన కొడుకులకు సమానంగా పంచి ఇచ్చి వెళ్ళి పోయాడు. ఆ డబ్బుతోనే అనిల్‌కు ఉద్యోగం వచ్చింది.

"ఈ ఆస్తిని నువ్వేం చూసుకుంటావే!" అన్నాడు భర్త. అందుకే చచ్చిపోతూ ఆస్తిని కొడుకుల చేతుల్లోనే పెట్టాడు.

"నాకూ ఏదో ఆధారం ఉండాలి కద! కొంత ఆస్తి నా పేర వుండనియ్యండి" అంది అనూరాధ మనస్సు చంపుకొని భర్తతో.

"ఆస్తిని నువ్వేం చేసుకుంటావు! రెండు పూటలా తిండి చాలదా నీకు. అది వాళ్ళే పెడ్తారు నీకు. ఆస్తి ఏం చేసుకుంటావ్!" అన్నాడు భర్త.

నిజమే అనుకుంది అనూరాధ.

"ఆస్తి నాకుంటే ఇప్పుడు కొడుకుల దయమీద ఆధారపడేది కాదు. జీవితంనిరర్థకం నిస్సారం అనిపించించేది కాదేమో" అనుకొని నిట్టూర్చింది.

ఆమె ఒంటరిగా వుండడం చూసి పక్క పేషంటు బంధువులు ఆమె దగ్గరికి వచ్చారు.

"ఏమిటి ఆపరేషను అన్నారట కద!" అని అడిగారు. అవునన్నది అనూరాధ.

"మీకేమీ ఇన్సూరెన్సు లేదా? ఇన్సూరెన్సు వుంటే వాళ్ళే ఆపరేషనుకయ్యే ఖర్చులు ఇస్తారు మరి!" అని అన్నారు.

"ఇన్సూరెన్సా!" అనుకుంది అనూరాధ.

"ప్రతి ఏడాది ఇన్సూరెన్సు డబ్బు ఎవరు కడ్తారు. విదేశాల్లో అయితే అటువంటి ఇన్సూరెన్సు కంపల్సరీ అంటారు. అందుకేనేమో అక్కడివాళ్ళు చాలాకాలం బతుకుతారు. వాళ్ళకు మనకులాగా జీవితం నిస్సారం నిరర్థకం అనిపించదా?" తనలో తనే అనుకొని ఆశ్చర్యపోయింది.

అనిల్ ఇంటికిపోయి విజయకు చెప్పాడీ విషయం.

"ఒకటి ఒకటిన్నర లక్షలా! అంత డబ్బు ఎక్కడి నుంచి తెస్తాం! మీ అన్నయ్యకి చెప్పండీ విషయం. ఆయనది పెద్ద ఉద్యోగం! మనిద్దరం ఉద్యోగం చేస్తున్నా ఆయన ఒక్కడి సంపాదనంత లేదు మన సంపాదన" అంది విజయ.

అన్నయ్య ! అవును. అన్నయ్యకు మెడికల్ రిఎంబర్సుమెంటు వుంటుంది. ప్రభుత్వమే వైద్యానిక్కావల్సిన డబ్బంతా ఇస్తుంది. మరిచేపోయాన్నేను అనుకొన్నాడు అనిల్. అప్పుడు కాస్త అతని మనస్సు తేలికయింది.

వెంటనే అనిల్ అన్నయ్య అజయ్‌కు ఫోన్ చేసి తల్లి విషయం చెప్పాడు.

''సరే! వెంటనే ఆపరేషను చేయించు. ఈరోజు సాయంత్రం మేము వచ్చి అమ్మను చూస్తాము'' అని అజయ్ ఫోన్ పెట్టేశాడు.

ఆరోజు సాయంత్రం అజయ్ భార్యతో తల్లిని చూడడానికి హాస్పిటల్‌కు వచ్చాడు. అతని పిల్లలు చదువుల్తో బిజీగా వున్నారు. రాలేదు.

''అమ్మా ! డాక్టరు నీకు ఆపరేషను చేయాలంటున్నాడు. చేయించుకో'' అన్నాడు అజయ్. అతని గొంతులో ఏ భావం లేదు.

''ఈ వయస్సులో ఇవన్నీ ఎందుకురా నాకు'' అంది అనూరాధ.

''ఎందుకేంటి అత్తయ్యా! వైద్యం చేయించుకోకపోతే నలుగురు మమల్నేమంటారు'' అంది అజయ్ భార్య రంజని.

అనూరాధ కోడలివైపు చూసింది. విసుగ్గా వున్న రంజని ముఖం మీది నుంచి చూపులు తిప్పి నిస్సహాయంగా కొడుకువైపు చూసింది.

''డబ్బు ఖర్చు ఎందుకురా! నేను బతికి చేసేదేముంది. మందులతో నయమవుతుంది అదే'' అంది అనూరాధ.

''ఖర్చుదేముందమ్మా!'' అన్నాడు అజయ్. అతడు వెళ్ళిపోవాలన్నట్లుగా లేచి నిలబడ్డాడు. అనిల్ వైపు చూసాడు.

''నేను పోవాలి. ఆఫీసుకు అమెరికను డెలిగేట్లు వచ్చారు. మీటింగు వుంది పోవాలి నేను. ఆపరేషను అంతా చూసుకో అనిల్! డబ్బుదేం ప్రాబ్లం కాదు'' అన్నాడు అజయ్.

''ఆపరేషనుకయ్యే ఖర్చులు మేం భరిస్తాం. కాని చూసుకునే బాధ్యత మీది'' అంది రంజని విజయ వైపు చూస్తూ.

అజయ్, రంజని ఎస్టీమ్ కార్లో వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిపోగానే విజయ ఎగిరి పడింది.

''డబ్బు మేం భరిస్తాం అంటుంది. పుణ్యానికి వచ్చిన డబ్బు. గవర్నమెంట్ డబ్బు తనే ఇస్తున్నట్లుగా మాట్లాడుతున్నది. చూడండి!'' అంది విజయ భర్తవైపు ఉరిమి చూస్తూ.

''అంత డబ్బే వుంటే ఓ మనిషిని పెట్టొచ్చుగదా! ఎవరు చూసుకుంటారిక్కడ!'' అరిచింది విజయ.

''ఇది హాస్పిటల్ విజయా!'' అన్నాడు అనిల్.

విజయ కోపంతో అక్కడి నుంచి వెళ్ళిపోయింది ఇంటికి.

''అనిల్! నాకు ఆపరేషను వద్దు. ఏమి వద్దురా. ఇప్పుడు గుండెనొప్పి కూడ లేదు. నన్ను ఇంటికి తీసుకుపో'' అంది అనూరాధ కొడుకువైపు దీనంగా చూస్తూ.

''ఆపరేషను చేయాలని డాక్టరు చెప్పాడు గద! చేయించుకోమ్మా!'' అన్నాడు అనిల్. అతని గొంతులో ఏ భావం ధ్వనించలేదు. అనూరాధ నిస్సహాయంగా నిట్టూర్చింది.

అనూరాధకు ఆపరేషను అయింది. రుసరుసలాడుతూనే విజయ హాస్పిటల్‌కు వచ్చేది ఒక్కసారి అజయ్ రంజని వచ్చి చూసి వెళ్ళారు. వాళ్ళు వెళ్ళిపోగానే విజయ కోపాన్ని ఆపుకోలేకపోయింది.

"తుర్రుమని ఎయిర్ కండిషను కార్లో వెళ్ళిపోయారు. మీ అమ్మకు నేను సేవలు చేయాలా! లంకంత ఇల్లు వుంది కదా వాళ్ళకు. వాళ్ళింటికి తీసుకుపోయి వుంచుకోవచ్చు కద! చూసుకోవ డానికి నేను బానిసలాగా వున్నాను కదా! - డబ్బు వుంది కద ఓ మనిషిని పెట్టి వాళ్ళనే చూసుకొమ్మని మీరు చెప్పవచ్చుగదా. మీరు చెప్పరు! ఇక్కడ నేనున్నాను కదా. వెట్టిచాకిరి చేయడానికి. - అయినా ఆ ముసలావిడ బతికి చేసేదేముంది గనుక! - ఈ తిప్పలంతా నేనెందుకు పడాలి! - ఏంటండీ! మాట్లాడరు" నోరు వంకరలు పోతుండగా పెద్దగా అరిచింది విజయ. అది విని అనూరాధ గుండె కలుక్కుమంది.

"నేనెంత బరువయ్యాను వీళ్ళకు!" చెప్పలేని బాధతో అనూరాధ గుండె పిండినట్లయింది.

అనూరాధకు ఆపరేషను అయింది. రెడు వారాలకు అనూరాధను ఇంటికి తీసుకువెళ్ళమన్నారు డాక్టర్లు. ఇంటికి పంపించేటప్పుడు బోలెడన్ని మందులు రాసి ఇచ్చారు. ఇంటికి వెళ్ళిం తర్వాత అనిల్ ఆ కాగితాన్ని తల్లి చేతికిచ్చాడు. ఏం మాట్లాడలేదు.

"ఆ మందులన్నీ కొనడానికి డబ్బు మనమెక్కడి నుంచి తెస్తామండి" అంది విజయ. ఆమె మాటలు విని అనూరాధకు ఏడ్పు వచ్చింది. కన్నీళ్ళు ధారలుగా కారాయి. ఆ కన్నీటి ధారలు ఎవరికీ కనపడకుండా ముఖం దాచేసుకుంది అనూరాధ.

"ఈ మందులన్నీ కొనడానికి నా దగ్గర డబ్బు లేదమ్మా! అన్నయ్య వస్తాడు కద డబ్బు అడుగు" అన్నాడు అనిల్. అజయ్ రానేలేదు. అనిల్ ఒకరోజు ఫోన్ చేసాడు.

"నేను బిజీగా వున్నాను. కావల్సిన మందులు కొను డబ్బు నేనిస్తాను" అన్నాడు.

"ఇస్తాడు ! నిజమే - కాని ఇప్పుడుకొనడానికి మన దగ్గర డబ్బు ఎక్కడుంది" అంది విజయ.

అనూరాధ ఒంటరిగా గదిలో పడుకుంది. ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఆమె గుండె చప్పుడు ఆమెకు స్పష్టంగా వినిపిస్తున్నది. అట్లా వింటూంటే ఆమెకు గుండెలో ఎక్కడో నొప్పి మొదలయినట్లనిపించింది. ఆ నొప్పి ఆగకుండా ఛాతి అంతటా పాకింది. అనూరాధ బలంగా గాలిని పీల్చింది. కాస్సేపటికి నొప్పి తగ్గింది. ఆమె మెల్లగా నిద్రలోకి జారుకొంది.

రెండు చేతులు చాపి తండ్రి నిలబడ్డాడు. "రా! రా! పరిగెత్తిరా!" అని పిల్చినట్లు వినిపించిందామెకు. తప్పటడుగులతో ఆమె అతని చేతుల్లోకి ఉరికింది.

"అబ్బ! ఎంత అందంగా వుంది తండ్రి పిలుపు! అతని చేతుల్లో ఎంత ప్రశాంతత వుంది" అనుకుంది అనూరాధ. ఆమెలో ఎంతో సంతృప్తి నిండిపోయింది. ఒళ్ళంతా ప్రశాంతమయం అయింది. దుఃఖం బాధ ఏదీ లేదక్కడ. ఆమె ముఖం మీద చిరునవ్వు అలుముకుంది. "ఇక్కడ ఎంత హాయి ఎంత సుఖం!" అనుకుంది అనూరాధ.

తెల్లవారి ఎంత పొద్దుపోయినా తల్లి లేచి ముఖం కడుక్కోడానికి బయటికి రాలేదని ఆలస్యంగా గమనించాడు అనిల్. విజయ ఆఫీసుకు పోయే తయారీలో వుంది.

అనిల్ తల్లి గదిలోకి వెళ్ళాడు.

అమ్మా అని పిల్చాడు.

అనూరాధ కదల్లేదు.

"ఇంత మొద్దు నిద్రేమిటి!" విసుక్కున్నాడు అనిల్. దగ్గరికి పోయి తల్లిని పట్టి ఊపాడు. అంతే ! అనూరాధ ప్రాణాలు రాత్రి ఎప్పుడు పోయాయో తెలియదు. అనిల్ చేతికి తల్లి శరీరం ఏ మార్దవం లేని రాయిలాగా తగిలింది.

*- సెప్టెంబర్-అక్టోబర్, 1999, భూమిక*